# నీటిమీది రంగులు

'భాను'

అది ఒక అందమైన నగరం. ఆ అందమైన నగరంలో జనసంచారం అట్టే లేని ఒక తారు రోడ్డు. ఎక్కడో దూరాన కొన్ని ఆఫీసులు తప్ప మరే సందడీ లేని అతి నిర్మానుష్యమైన ప్రదేశం.

రోడ్డు కొక వైపున బస్ స్టాప్. వేసవి గడిచి పోయి తొలకరి ప్రవేశించిన రోజులవి. ఆకాశం మబ్బు మబ్బుగా ఉంది. చల్లని గాలులు వీస్తున్నాయి. క్రితం రోజు కురిసిన తాలూకు వర్షపు నీళ్ళు పేవ్‌మెంటు అంచుల్ని తాకుతూ బస్‌స్టాప్ దాకా నిలిచి పోయి వున్నాయి. ఎప్పుడో ఒక సారి వచ్చే వాటిని చిమ్ముకుంటూ పోతున్నాయి. అవి చలించి కాసేపటికి నిశ్చలంగా నిలిచి పోతున్నాయి. . . అవి వదిలి పెట్టి వెళ్ళిపోయిన రంగుల్ని ప్రతిఫలించుకుంటూ.

ఆ నీటి అద్దంలో ఇద్దరి ప్రతిబింబాలు. ఒక యువకుడూ, యువతీ. అది ప్రేమికులు కలుసుకునేందుకు అనువైన ప్రదేశం. కాని వాళ్ళు ప్రేమికులు కాదు. కొత్త దంపతులు. పెళ్ళయి అది అయిదవ రోజు.

ఆమెని చూసి అతననుకున్నాడు—'ఆడంబరాలూ, ప్రత్యేకమైన అలంకరణలూ ఏమీ లేకపోయినా, ఎంత సామాన్యమైన బట్టలు ధరించినా, ఆమెలో కొత్త పెళ్ళి కూతురి కళ తాండవిస్తుంది. చెంపల మీది పసుపు ఛాయ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. చలిగాలికి పమిట భుజాల నిండుగా కప్పుకుంది. హుందాతనం, సంస్కారం మేళవించుకున్న సామాన్యమైన అందం ఆమెది. అంతకన్నా ఆమెలో అతడు ఆకర్షించిన ప్రత్యేకత మరొకటి—ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా, స్వచ్ఛంగా నవ్వుతూ మాట్లాడ గలగడం. పెళ్ళయిన నాల్గవ రోజు తన దగ్గరికి నవ్వుతూ వచ్చి తనే అంది—"అలా ఎక్కడికైనా వెళ్ళి వద్దాం పదండి" అని.


"ఎక్కడికి? షాపింగుకా, సినిమాకా?" అనడిగాడు, పెళ్ళయిన కొత్తలో తీర్చుకోవలసిన సరదాలు అవే కదా అనుకుని.

అందుకామె సమాధానం, "ఊ అవేం నాకు అక్కర్లేదు. నాకు కావలసిందల్లా మీతో ఒంటరిగా దూరంగా అందరికీ దూరంగా ఏకాంత ప్రదేశంలో కాసేపు గడపడం. . ."

అలా నిష్కల్మషంగా మాట్లాడ గలగటం అతడిని చాలా ఆశ్చర్య పరిచింది. మిగతా బంధువులూ, వాళ్ళూ ఏవో విడ్డూరం చూస్తున్నట్లు చూస్తు పోయినా అతడికి మాత్రం చాలా ఆనందం కలిగింది. చూస్తున్న కొద్దీ అతడికి ఆమె మామూలు ఆడవాళ్ళ కింద జమ కట్టవలసిన విధంగా కనబడటం లేదు. ఎంత చదువుకున్న యువతి అయినా, అంతకు మించిన సంస్కారం ఆమెలో ప్రతిఫలిస్తున్నది. తనకి ఆమె ఎంత కొత్తయినా ఆమె మాత్రం తనని ఎంతో చేరువ చేసుకుంటున్నది. అదే ఆమె ప్రత్యేకత. . . అలా ఆలోచిస్తూ ఆమెనే తదేకంగా చూస్తూ ఉండి పోయాడు. అలా చూస్తూ ఉంటే ఆమె మరోసారి హాయిగా నవ్వింది. ఎక్కువగా మాట్లాడని అతడి ముభావత, గాంభీర్యం—ఎప్పుడో కానీ పెదాల మీద సున్నితంగా వెలిసే చిరునవ్వూ ఇవీ ఆమెకి అతడి లోని ఆకర్షణలు.


అతడు ఆమెని వివాహం చేసుకున్నది తన కోసం





Dattaram-NP-23 Tel

అనన్య సామాన్య ప్రచారం గల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక




కాదు. అతడు తన జీవితంలో ఒక స్త్రీ ప్రవేశించడం అన్న విషయం గురించి స్వంతంగా ఆలోచించడం అన్నది ఏ నాడో మాని వేశాడు. ఆమె ఇలా ఇలా ఉండాలని కోరికలేం లేవు. ఎలా ఉన్నా ఒకటే.

అటువంటి కోరికలూ, ఆశలూ ఏనాడో అంతరించి పోయినాయి నీహారిక నిష్క్రమణతో. ఇప్పుడతడు పెళ్ళి చేసుకోవడం తల్లి దండ్రులను సంతృప్తి పరచడం కోసం. వాళ్ళు అతడి మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నదంతా తగలేసి అప్పులు చేసి చదివించారు, ఇంజనీరింగ్. ఆ తరవాత నిరుద్యోగి అయిన అతడ్ని ఎనిమిదేళ్ళు భరించారు. ఆ తాలూకు ఋణాల్ని చెల్లించడం కోసమే ఈ పెళ్ళి. ఇందులో మరో ప్రసక్తి లేదు. వాళ్ళు కోరుకున్న కట్నం ఈ అమ్మాయి తెచ్చింది. వాళ్ళకి నచ్చింది. చదువుకుంది. ఎలాగో వాళ్ళని సంతృప్తి పరచ గలిగాడు. ఇప్పుడిక ఈ అమ్మాయిని అన్ని విధాలా సంతృప్తి పరచడానికి ప్రయత్నించాలి. అందుకోసమే జీవించాలి. అంతే. ఆ యువతి మీద అతడికి ప్రత్యేకమైన భావాలేమీ లేవు. అతడి మనసు పూర్తిగా మోడు వారిపోయింది. నీహారిక లేకపోయాక ఎవరైనా ఒకటే.

అతడి ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ, అతడి నిర్లిప్తతని లెక్క చేయకుండా గలగలా మాట్లాడుతూంది ఆ యువతి. "మీతో ఇవ్వాళ ఎన్నో స్వంత విషయాల్ని గురించి మాట్లాడవలసి ఉంది. ఎన్నో బాధల్ని పంచుకోవాల్సి ఉంది. అందుకే ప్రత్యేకంగా ఎక్కడికైనా తీసుకెళ్ళమని అడిగింది.". ఆ మాటల్లోని నిష్కల్మషత్వం అతడ్ని మరీ మరీ ఆకర్షిస్తున్నది మొదట్నుంచీను. మొదటి పరిచయం పెళ్ళి చూపుల్లోనే. తరవాత ఒకర్ని గురించి మరొకరు తెలుసుకోవడం అయింది. ఆ స్వల్ప వ్యవధిలోనే ఒకరి మీద మరొకరికి ఏర్పడిన ఇష్టం పెళ్ళి నిశ్చయమైనాక మరి కొంత సన్నిహిత పరిచింది. అందుకే ఆమె పెళ్ళికి కావలసిన బట్టలూ, వగైరా, స్వయంగా కొనాలని పట్టు పట్టింది. అలాగే ఇద్దరగా కలిసి షాపింగ్ చేశారు. హోటలు కెళ్ళారు. ఆ తరవాత ఇదే కలుసుకోవడం.

ఇద్దరూ బస్సు దిగి, విశాలమైన తారు రోడ్డుని క్రాస్ చేస్తూ పదిహేనవ నంబర్ బస్సు ఎక్కి మరో బస్ స్టాప్ వద్దకి చేరుకున్నారు.

"ఇక్కడుంచి మరో బస్సు కాచ్ చెయ్యాల్సి ఉందా?" అనడిగిందామె.

అతడు కొంచెం తికమక పడ్డాడు. అసలక్కడికి ఎందుకు వచ్చాడో అర్థం కాలేదు. అప్రయత్నంగా అనాలోచితంగా వచ్చేశాడు. మనస్సు భారమైంది. పైకి నవ్వేస్తూ—"మనం కలుసుకోవలసిన ఏకాంత ప్రదేశం ఇదే ఎందుక్కాకూడదూ?" అన్నాడు.

ఆమె గలగలా నవ్వింది. "ఏ పార్కుకో బీచికో తీసుకెళతారనుకున్నాను కానీ. . . ఇలా బస్ స్టాప్‌కి తీసుకొస్తారని అనుకోలేదు. . ." అంటూ.

అతడి మనసులో ఉదాసీనత. తెరలు తెరలుగా కళ్ళ ముందు జ్ఞాపకాల సరదాలు. . . అవును. . . ఈ బస్ స్టాప్‌కి, తనకీ. . . అవిభాజ్య సంబంధం. అది ఒకనాడు ఒకరు తీరని విరహంలో



ఇటీవల విదేశ పర్యటన ముగించుకొని వచ్చిన డాక్టర్ దాశరథి గౌరవార్థం మద్రాసులోని కళాసాగర్ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో అత్తిలి కృష్ణ రచించిన "తూర్పు రేఖలు" నాటకంలోని ఒక దృశ్యం

తీయగా బాధగా నిరీక్షించు కున్న అందమైన ప్రదేశం. చూసే వాళ్ళకి అనుమానం లేకుండా గంటలు తరబడి మాట్లాడు కునే వాళ్ళు. ఎన్ని బస్సులు వచ్చినా ఒక్కటి ఎక్కే వాళ్ళు కాదు. కళ్ళ ముందు పరుచుకున్న పరదాల్లో ఎదురుగా నీహారిక నిలిచింది. అదే విధమైన పసుపు బట్టల్లో . . . నవ్వుతూ.

అతడు తమాయించుకుంటూ ఈ లోకం లోకి వచ్చాడు. ఇక్కడికి ఆమెని తీసుకుని రావడంలో తన ఆంతర్యం ఏమిటో అతడికే అర్థం కాలేదు. అది పూర్తిగా అసంకల్పిత చర్య.

నీహారిక పెళ్ళితో అతనిలో చెప్పలేని మార్పులు వచ్చాయి. నిర్లిప్తత, పరధ్యానం, గంభీరత—నీహారిక అతడిలో శాశ్వతంగా వదలి వేసిన ముద్రలు. వ్యధే ప్రేమ ప్రసాదించిన అందమైన వరం. నీహారికతో గడిపిన ప్రతి క్షణాలూ వేటికవే ప్రత్యేకంగా శిల్పాల్లాగా మనసులో నిలిచి పోయిన అనుభవాలు. . . అవే అతని హృదయానికి అవ్యక్తమైన స్వాంతనా గీతాల్ని వినిపిస్తాయి. . . ఆ స్మరణలే అతడి మనస్సుని జోకొడతాయి. . .

వర్షపు రాత్రుల్లో సినిమాలకి వెళ్ళడం. చేయి చేయి కలిపి వెచ్చగా ఊసులాడుకోవడమూ, ఆ సన్నజాజుల పరిమళం, ఆ చలీ, ఆ వెచ్చదనం అన్నీ ఒక్క నిట్టూర్పుతో ముగుస్తాయి నీహారికని స్వంతం చేసుకోలేకపోయిన తన అశక్తతకీ, అసహాయతకీ తన మీద తనకే అసహ్యం వేస్తుంది. గడచిన మూడేళ్ళ నుండీ ఇదే అతడి జీవితం.

"మనల్ని ఏ శక్తీ విడదీయ లేదు కదూ వేణూ! ఈ ప్రపంచ మంతా ఒక్కటైనా నన్ను నీ నుండి వేరు చెయలేదు..." నీహారిక ఎన్నో వాగ్దానాలు చేసేది ఆవేశంలో. ఎన్నో వాగ్దానాలని తన నుండి కోరేది.

కాలం గడిచే కొద్దీ నీహారిక నయనాల్లో పేరు కుంటూ ఉండే నిరాశా, దీనత్వం తాలూకు నీడలు అతన్ని విపరీతంగా భయ పెట్టేవి. నీహారిక చూపుల్ని తప్పించుకునేందుకు ప్రయత్నించే వాడు. అయినా అవి అహోరాత్రులూ, అతన్ని వెంటాడేవి.

అతడికి ఏదయినా ఇంటర్వ్యూ కాల్ వస్తే అతడి కంటే ముందు ఆమె నయనాల్లో ఎన్నో ఆశల జ్యోతులు వెలిగేవి. . . ఇంటర్వ్యూకి వెళ్ళి రాగానే, కోటి కోటి ఆశలతో, ఆరాటంగా ఎదురు చూస్తూ ఉండే నీహారికని చూడగానే మనస్సు నిరాశతోనూ, అవమాన భారంతోనూ కృంగి, పోయేది. "ఏమయింది వేణూ. . . ఏదైనా హోప్ ఉందా?" అన్న ప్రశ్నకి, ఎదురయిన నిరాశతో చివరి సారిగా ప్రకాశవంతంగా వెలిగి గప్పున ఆరి పోయే దీపాల్లా ఆ కళ్ళు వాలి పోయేవి. చీకటి అలుముకునేది.

"మన మనస్సు లోని ఆరాటం వేరు. ఆలోచనలు వేరు. అవి జీవితంలో కలవనివి వేణూ! ఎన్నటికీ కలవనివి. మనల్ని ఏ శక్తీ విడదీయ లేదు అనుకున్నాం కదూ. ఏ శక్తో ఎందుకు? నీ మంచి నేనే ప్రయత్న పూర్వకంగా విడి పోతున్నాను. చిత్రంగా లేదూ . . ." అని నిరాశగా నవ్వింది.

"మనం పెళ్ళి చేసుకుంటే కాపరం ఉండాల్సింది, నూటాయాభై రూపాయల అద్దెతో వచే చిన్న ఇరుకు గదిలో వేణూ! మనం అందంగా నిర్మించు కున్న వూహా సౌధాలలో కాదు. ఆ నూటయాభై రూపాయలూ సంపాదించుకుని ఆ ఇరుకు గదిలో ఉండగలిగితే, ఆ పైన ఎన్ని అంతస్తుల ఆకాశ హర్మ్యాల నైనా నిర్మించుకో వచ్చు. ఆ ప్రేమైక సౌధాలన్నిటికీ పునాది అక్కడే సుమా."

పిచ్చి ఆవేశపు ప్రేమ మైకం నుండి మేల్కొని, వివేకం లోకజ్ఞానం అలవరుచుకుంటూ, తల్లి దండ్రులూ, తోబుట్టువులూ, స్నేహితులూ, అందరూ నచ్చచెప్పే లోక రీతిని అర్థం చేసుకుంటూ, తనలో జీర్ణించుకుంటున్న నీహారిక వేదాంతం అది. చివరకు ఫలితం వివాహం. తల్లి దండ్రులు ఎంచిన నెలకి వెయ్యి రూపాయలు సంపాదించే వరుడితో.

ఆ నాటి రాత్రి అతడి గదిలో అతడి ఫ్రెండ్స్ వేయి కళ్ళతో అతడికి కాపలా ఉన్నారు అతడి ఆవేశానికీ, దుఃఖానికి ఆనకట్టలు వేస్తూ. ఆ క్షణంలో అత్యంత ప్రియంగా కనుపించే మృత్యువుని అతడికి కాకుండా చేస్తూ.

"నన్ను క్షమించు వేణూ! నీ కోసం జీవితకాల మంతా నిరీక్షించ గల ననుకున్నాను. కానీ నా కది సాధ్యం కాలేకపోయింది. నా చుట్టూ ప్రపంచం ఈ అనుబంధాలూ, నన్నలా ఉండనీయవు వేణూ. తన వేపు లాక్కుని తన జీవన రీతిలో పడవేసే వరకూ ఈ సంఘం ఊరుకోదు. నేను బలహీనురాలిని. అశక్తురాలిని వేణూ. అందుకే అంటున్నాను. మనసుకి కావలసినవి ఏ నాటికీ తీరవు. మనిషికి కావలసిన అవసరాలు తీరతాయి కానీ, మనసు దాహంతో

# మంచి పుస్తకాలు

1. జీవితరహస్యాలు:- దివ్యకామసూత్రాలు. రూ. 5
2. యువతి:- దాంపత్యరహస్యాలు. రూ. 5
3. సంతానము:- గర్భనిరోధ మార్గాలు. రూ. 5
4. చేతిపనులు:- సంపాదన మార్గాలు. రూ. 5
5. అద్భుతహాస్యకథలు:- నవ్వటానికి. రూ. 5
6. రసికత్రయకథలు:- శృంగారహాస్యం. రూ. 5
7. మోస్తవ్వఫలితాలు:- స్వప్నాలడిక్షనరీ. రూ. 5
8. మానసికశక్తులు:- అన్నీ అన్నివివరాలతో. రూ. 5
9. మంత్రశక్తి:- వివిధ సాధనరహస్యాలు. రూ. 5
10. ఐదువైద్యవిధానాలు:- అన్నిరోగాలకువివిధమందులు రూ. 10
11. ఆహారవైద్యము:- ప్రకృతి ఆహారమార్గాలు. రూ. 10
12. మూలికావైద్యము:- అందరికితెలిసినమొక్కలతో రూ. 10
13. దైవదర్శిని:- బాధల విముక్తికిదైవరహస్యాలు రూ. 10
14. వ్యవహారదర్శిని:- నిత్యవ్యవహారవిధానబోధిని. రూ. 10

రూ. 20. ఆపైవిలువ ఆర్డర్లకు వి.పి.పోష్టుఖర్చుఉచితం అంతకన్నా తక్కువ ఆర్డర్లకు పోష్టేజి రూ. 4 అదనం

దేశసేవ ప్రచురణాలు
5/3 ఆర్‌టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4



# దేహపుష్టికి ఆరోగ్యానికి


పండిట్-డి. గోపాలాచార్యులవారి

## జీవామృతము

69 సంవత్సరములకు పైగా ప్రసిద్ధి గాంచినది

ఆయుర్వేదాశ్రమము
ప్రైవేట్ లిమిటెడ్
మదరాసు-17.







తనిస్తూనే ఉంటుంది. మనిషి బంధాల వలయాల్లో పరిభ్రమిస్తూనే ఉంటాడు. మనిషి లోని మనసుకీ, మనిషికీ మధ్య ఎంత అఘాతం వేణూ. . ."

నీహారిక పిచ్చి వేదాంతంలో ఎంతో సత్యం ఉంది. "మనం ఒకటి కాకపోవడంలో నీ తప్పు ఏమీ లేదు. నీహా! కేవలం నా అశక్తత. నేను ఓడిపోయిన వాడ్ని. నన్ను క్షమని ఎందుకు అర్థిస్తావు? రాజీ పడ్డానికి ప్రయత్నించు. సుఖ పడడానికి ప్రయత్నించు."

• • •

"మీరు చాలా మూడీగా ఉంటారు ఎందుకు...",

తెప్పరిల్లి అతడు ఈ లోకంలోకి వచ్చాడు. అది ఆమె అడిగిన ప్రశ్న. "అబ్బే. ఏమీ లేదు ఏదో ఆలోచిస్తూ ఉండి పోయాను. అంతే" అన్నాడు. నెమ్మదిగా ఆమె చేతిని తన చేతి లోకి తీసుకుని, గాజులు సవరించాడు. మృదువుగా నొక్కాడు. ఆప్యాయత, అనురాగం ప్రకటించాలని అతడి తాపత్రయం. నీహారిక తప్ప అతడు జీవితంలో మరే స్త్రీ తోనూ సన్నిహితంగా రాలేదు. అందుకే అతడి చేయి వణుకుతున్నది. మనసులో ఒక్కసారిగా లావాలా ఉడికిన వ్యథ ఘనీభవించి తెలీని జడత్వం నరనరాల్లో వ్యాపించి చల్లనిపించింది. అణువణువుల్లో నీహారిక. . . కళ్ళ ముందు నీహారిక పసుపు బట్టల్లో. . . కళ్ళతో నవ్వుతూ ఆక్రోశిస్తున్న నీహారిక. . .

అతడు ఉద్వేగాన్ని దిగమింగుకున్నాడు. ఆమె చేతిని వదిలి వేశాడు. తనని తాను తమాయించుకున్నాడు. కానీ ఆమె చేతి వేళ్ళు అతడి చేతిని కొంచెం సేపు పెనవేసుకుని తరవాత మెల్లగా విడిపోయినాయి.

"విధి—భగవంతుడు నుదుటి రాత — ఈ విషయాల్లో బొత్తిగా నమ్మకం ఉండేది కాదు. అంతా నాన్‌సెన్స్ అనుకునేదాన్ని. కానీ ఈనాడు నమ్మవలసి వస్తోంది. ఎందుకంటే నేను కళ్ళు మూసుకుని గుడ్డిగా చేసుకున్న ఎంపికలో కూడా మాణిక్యమే చేజిక్కింది. నే నభిమానించే ఆత్మ సౌందర్యం, సంస్కారవంతమైన వ్యక్తిత్వం కల మిమ్మల్ని పొందడం నా అదృష్టం. పశువులను వెల పోసి బజారులో కొన్నట్టు కొనుక్కున్నా— మీరు మాత్రం అందరిలాటి వారు కాదు. నేను చాలా బ్లంట్‌గా మాట్లాడతాను. క్షమించండి. మీరు కట్నం తీసుకున్నారని హేళన చెయ్యటం లేదు. మీ అవసరాలూ, ఆశక్తతా, మీ తల్లిదండ్రుల ఆరాటం — అన్నిటినీ అర్థం చేసుకున్నాను. మీ సంస్కారం నాకు ఎంతో ఉన్నతమైనదిగా కనబడుతోంది..." అని తిరిగి తనే మొదలు పెట్టింది.

"నేను చాలా తెలివి గల దాన్నని అందరి అభిప్రాయం. ఒక్క చదువులోనే కాదు. అన్ని విషయాల్లోనూ. అమ్మ, నాన్న, తోబుట్టువులు, స్నేహితులూ, లెక్చరర్లూ అందరూ నన్ను మెచ్చుకుంటూ ఉండేవాళ్ళు. ప్రత్యేకంగా నాన్న గారికి నా తెలివి తేటల మీద ఎంతో ఉన్నతమైన అభిప్రాయం. అందుకే అన్ని విషయాల్లో అంటే, చదువు, వివాహం ఈ విషయాలో సంపూర్ణమైన స్వేచ్ఛనిచ్చారు. నేను స్వతంత్రంగానే జీవితాన్ని చక్కగా తీర్చి దిద్దుకోగలనని ఆయన నమ్మకం. కానీ నేనెంతటి వాజమ్మనో, ఫూల్‌నో, కొన్నాళ్ళకు నాకు తప్ప మరెవరికీ తెలిసి రాలేదు.

మా నాన్నగారు సామాన్యమైన ఉద్యోగి. గంపెడు సంతానం. అందర్లోకి నేనే పెద్ద. కానీ అమ్మ నేర్పరితనం, పొదుపరి తనం చాకచక్యంవల్ల అందరికీ అన్నీ జరిగిపోతుండేవి — చదువుల వరకైనా. డిగ్రీ అయిపోయింది. ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాను. పెద్ద దాన్ని కనుక పెళ్ళి చెయ్యాలని నాన్న అభిప్రాయం. నాన్నకి ఏదోవిధంగా సాయపడాలని నా ఆరాటం. కనీసం నా సంపాదనలో కొంత చేర్చి, నా పెళ్ళి విషయంలో నాన్నకి కొంత భారం తగ్గించాలని నా తాపత్రయం. కానీ పెళ్ళి విషయంలో తప్పించుకోలేని ఒత్తిడి తీసుకు వచ్చిన రోజున నిష్కల్మషంగా నాన్నతో చెప్పి వేశాను. "బావ'ని చేసుకుంటానని. నాన్న మొహం వికసించింది. శ్రీనివాసరావు నాన్న గారి చెల్లెలి కొడుకు. తల్లిదండ్రీ చిన్నతనంలోనే పోయారు. అతడు చాలా పేదరికం అనుభవించాడు. నాన్నగారు దగ్గరకు తీసి స్కూల్‌ఫైనల్ వరకు చదివించారు. తరవాత ఏదో చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతనంటే నాన్నగారికి ప్రేమా, జాలీ, అభిమానం.

"కానీ అతణ్ణి చేసుకుని నువ్వేం సుఖపడగలవమ్మా. పైగా నీ కంటే తక్కువ చదువు" అన్నారు. కానీ నాసంగతి తెలీదు. చాలాకాలం నుండీ నేను అతణ్ణి గాఢంగా ఆరాధిస్తున్న విషయం. అతడూ. అంతే ఇద్దరి మనస్సుల్లోని ప్రేమ ఎంతో పవిత్రమైనది. గాఢమైనది అనుకునే వాళ్ళం. నా నిశ్చయం విన్న రోజున నాన్న ఎంతో సంతోషించారు కానీ, అతణ్ణి చేసుకుని నేను సుఖపడలేనన్నది ఆయన విచారం. అమ్మ ససేమిరా ఒప్పుకోలేదు. నేను ఎంతగానో విపులీకరించి చెప్పాను. కేవలం ఆర్థికంగా తృప్తి పడడంలోనే సుఖం అన్నది లేదనీ, మానసికంగా తృప్తిపడడం ఎంతో ముఖ్యమనీ, అదీ గాక నాకూ ఒక ఉద్యోగమంటూ వచ్చిన తరవాత అదీ ఒక లెక్కలోకి రాదనీ.

కానీ వీటన్నిటి లోను ఒక కొత్త విషయం తెలియవచ్చింది. నాన్నగారు పదిహేనువేల దాకా కూడబెట్టిన సంగతి. అమ్మ తన పేర మూడు వేలు దాచిన సంగతి, నాన్నగారు ఇంట్లో ఖర్చులకు. పిల్లల చదువులకు బట్టలకు. ఇచ్చే డబ్బులో నుండి మిగిల్చి! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. బాబిగాడు నెయ్యి కోసం, పెరుగుకోసం ఏడ్చే సన్నివేశాలూ, పదెళ్ళ శాంతి కొత్త ఫ్రాకుకొనలేదని అలిగి అన్నం తినక పోవడం, తమ్ముళ్ళు, స్కూల్ ఎక్స్‌కర్షన్ పోలేకపోయినందుకు నిరాశపడిపోవడం— అన్నీ కళ్ళముందు కదిలాయి.

అందుకే నాన్నతో అన్నాను—"బావని చేసుకుంటూ నే నేదో త్యాగం చేస్తున్నానని మీ రనుకో వద్దు. బావని మనస్ఫూర్తిగా ప్రేమించాను. అందుకే చేసుకుంటాను. నా కోసం కట్నం గురించి మీరు



**అండమాన్ ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటికలో పాత్రధారులు**

కానీ ఖర్చు చేయడం నేను సహించ లేను. మీరు సంపాదించిం దంతా కేవలం నా ఒక్కదాని కోసమే ఖర్చు చేస్తే మిగతా వాళ్ళ భవిష్య త్తేమిటి? వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళు?''

''భలే చెప్పావు. కానీ ఈ రోజుల్లో కట్నం లేకుండా ఎవరమ్మా చేసుకునేది? ఎంత బావైతే మాత్రం మనం ఇవ్వాల్సింది ఇవ్వాలా, అక్కర్లేదా?''

''లేదు. బావకి నేను కట్నం ఇవ్వాల్సిన అవసరం లేదు. బావకి కావలిసింది నేను. మరేమీ కాదు అనుకున్నాను. నా ఉద్దేశ్యం కట్నం ఇవ్వకుండా నాన్నగారికి డబ్బు మిగల్చాలని కాదు. నాకూ, బావకీ గల అనుబంధంలో 'వ్యాపారం' చోటు చేసుకో కూడదు. అదే నా ఆరాటం. తపన. అదీకాక నాన్నగారు రెండు మూడు సంవత్సరాల తరవాత రిటైర్ అవుతారు. అదే ఆయనతో అన్నాను. అందరి కంటే చిన్న ఏడేళ్ళ ఉషనీ, ప్రత్యేకంగా గుర్తు చేశాను. ఇక తమ్ముళ్ళ చదువులూ, ఉద్యోగాల సంగతేమిటి? ఆ తరవాత వృద్ధాప్యంలో ఉండడానికి ఒక కొంప గోడూ కావాలా అక్కర్లేదా? నాన్నగారు ఎప్పుడూ నాకు గౌరవం ఇచ్చి మాట్లాడతారు. అంతవరకూ ఏ నాడూ నేను నాన్నగారి మాటని ఎదిరించింది లేదూ. నాన్నగారు నా మాటని త్రోసి పుచ్చింది లేదు. కానీ ఆ రోజు ఆ విషయంలో మాత్రం మా ఇద్దరి మధ్యా ఎడ తెగని వాగ్యుద్ధం జరిగింది. మా నిర్ణయాలు ఉద్దేశాలు కలవ లేదు. చివరికి కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాను. 'పెళ్ళి నిరాడంబరంగా వీలయినంత తక్కువ ఖర్చుతో అయిపోవాలి. ఇక కట్నం గురించి ఒక్క పైసాకూడా ఇవ్వకూడదు. అలా కాని పక్షంలో నేను పెళ్ళే చేసుకోను' అంటూ మొండి కేశాను.

నాన్నగారు పరిహాసంగా నవ్వారు. 'చదువులో ఇతరత్రా విషయా ల్లోనూ, ఇంత తెలివి గల దానివి ఈ విషయంలో ఇలా మాట్లాడటం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. నీకు ప్రపంచ మంటే ఏమిటో తెలియదులా ఉంది. ఎల్. డి. సి. ఉద్యోగం చేస్తున్న బావే కాదు. బజార్లో మూటలు మోసే కూలీ, రిక్షా లాగే రిక్షా వాడూకూడా కట్నం అడుగుతారు. అది లేనిదే బావే కానీ, మరింకెవరయినా కానీ మెళ్ళో తాళి కట్టరు. ఇది లోకవృత్తం.''


'నా కన్నీ తెలుసు. నా కలాటి వ్యాపారాలు ఇష్టం లేవు. ఇవి ఇప్పటి తెలుగు నవల్లో, తెలుగు సినిమాలూ చూసి వంట పట్టించుకున్న చవకబారు ఆదర్శాలు కావు. ఆవేశమూ కాదు. మం రొకరి విషయంలో చెప్పలేను కానీ బావ విషయంలో మాత్రం నాకు మనసులు తప్ప మరేమీ ప్రధానం కాదు. నన్ను చూసి, నా గురించి తెలుసుకుని నా వ్యక్తిత్వం అంటే ఇష్టపడి చేసుకున్న వ్యక్తిని తప్ప మరెవరినీ ప్రేమించ లేనూ, గౌరవించలేను' అంటూ... ఏడేళ్ళ ఉష పెరిగి పెద్ద దయ్యేటప్పటికి, ... వాళ్ళ భవిష్యత్తులూ తలుచుకుంటేనే ... వెయ్యసాగింది. రిటైరయ్యాక వచ్చిన డబ్బుతో చిన్న ఇల్లు కొంటారుట. తరవాత తమ్ముళ్ళకి ఉద్యోగాలు వస్తే, వాళ్ళ డబ్బుతో రమా, శాంతిల పెళ్ళిళ్ళు చేస్తారట. ఆ తరవాత ఇల్లు అమ్మేసి ఉష పెళ్ళి చేసి, తమ్ముళ్ళ దగ్గర ఉంటారట. ఇవీ ఆయన ఆలోచనలు. నాకు నవ్యంగా కనిపించ లేదు. నాన్నగారు నాకు నచ్చ చెప్పడం కోసం అలా చెప్పారే కానీ, ఆయనకి భవిష్యత్తు గురించి కొంచెం కూడా ఆలోచన లేదు. అన్నీ తెలిసికూడా ఇంత గుడ్డిగా, నా పెళ్ళి కోసం పదిహేను వేలదాకా, అంటే ఆయన గాడిద చాకిరీ సర్వీసులోని మూడవ భాగం నాకే ఎలా ఖర్చు చేయాలనుకుంటున్నారో నాకు అర్థం కాలేదు. మొట్టమొదటి శుభ కార్యం అవటం వల్ల ఘనంగా జరగాలట నాన్సెన్స్. ఎంత చెప్పినా ఆయన తిక్కన్నే లేదు. అమ్మదీ అదే అభిప్రాయం. అయితే ఆవిడకు నేను బావని చేసుకోవడం ఏ మాత్రమూ ఇష్టం లేదు.

ఆ రోజు నాన్నగారు వైజాగ్ నుండి తిరిగి వచ్చారు. అంతా కుదిరి పోయిందనీ, ఖాయపరుచుకునేందుకుబావ తరపున వాళ్ళఫలాని రోజు వస్తున్నారనీ చెప్పారు. అంతకంటే నా కింకేమీ చెప్పలేదు. నా కేదో గోపనంగా ఉంచినట్లు అనిపించ సాగింది. రెండు రోజుల తరవాత తెలిసింది—నాన్న బావకి పది వేలు కట్నం ఇస్తున్నట్లు. నాన్న మూర్ఖత్వం మీద నాకువాలా కోపం వచ్చింది. మరో రెండు రోజుల తరవాత మరో ఆశ్చర్యకరమైన విషయం బయట పడింది.

నాన్న ఎనిమిది వేలే ఇస్తా మన్నారట. బావ





**బొంబాయిలోని వివేక గ్రంథాలయ కార్యవర్గం. శ్రీయుతులు వంగ సోమలింగం, పొట్ల నరసింగ్, రాపెల్లి రామకృష్ణ, పి. నాగరాజులు, హెచ్. ఎస్. పాలేప్, వి. ఎ. కె. విశ్వేశ్వరరావు, పిట్ల భూమేశ్వర్, రాజుల గంగారామ్, జయప్రకాష్ వాగ్**



వచ్చే...వచ్చే...సంక్రాంతి

-చిత్రకారుడు, ఇష్టేల




ససేమిరా వీల్లే దన్నాడట. పది వేల కంటే తక్కువ అయితే కుదర దన్నాడట. పన్నెండు వేలు ఇస్తామని చాలా ఆఫర్లొస్తున్నాయనికూడా అన్నాడట. నాకు నమ్మశక్యం కాలేదు. బావ కట్నం వద్దనే ఉంటాడు. నాన్నగారు బలవంతం చేసి ఉంటారు అనుకున్నాను. . . . కానీ బావ అలా అని ఉంటాడని నేను నమ్మలేదు. అందుకే నాన్నగారికి తెలీకుండా బావకి టెలిగ్రామ్ ఇచ్చాను. నాన్నగారు ఏ విషయమూ నాకు స్పష్టంగా చెప్పటం లేదు. నన్ను సమాధాన పరచటం కోసం ఏవో కథ లల్లుతున్నట్లే అనిపించింది అందుకే బావతో సూటిగా మాటాడ దలచుకున్నాను.

బావ వచ్చాడు.

"ఇందుకేనా టెలిగ్రామ్ ఇచ్చి కొంప మునుగుతున్నట్లు పిలిపించావు. ఇంకా ఏదో అనుకున్నాను. ఆ విషయా లన్నీ నిజం, సంధ్యా, పన్నెండు వేల దాకా ఇస్తామని చాలా సంబంధాలు వస్తున్నాయి" అన్నాడు కొంచెం గర్వంగా. 'అదీగాక వచ్చే నెల్లో ప్రమోషనుకూడా రాబోతోంది.'

నేను నిర్ఘాంత పోయాను. అతడు ఆ మాత్రం ప్రయోజకుడు కావడానికి నాన్నగారు ఎంత కష్టపడ్డారు ఎంత సహాయ పడ్డారు ఆయన సహాయమే లేకపోతే వీధుల్లో సోడాలో, శనక్కాయలో అమ్ముకుంటూ ఉండేవాడు. ప్రమోషన్ వస్తుందట. ఎంత అందంగా చెప్పకుంటున్నాడు. ఆ సమయంలో నన్ను బాధించింది, అతడి కృతఘ్నత కాదు. అతడి సంస్కార హీనత. బావ ఇంత సంస్కార హీనుడుగా ఎలా మారిపోయాడు. ఇతడినేనా ఇన్నాళ్ళు నేను అంత ఉన్నతమైన పీటం మీద కూర్చో పెట్టి ఆరాధించింది. ఆ క్షణాల్లో నా మీద నాకు ఎంత సిగ్గు వేసిందో చెప్పలేను.

"నీ వెంత ధర పలుకుతున్నా వన్న గొప్ప కాదు కావలిసింది నాకు. నన్ను చేసుకోవడం నీకు ఇష్టమేనా, కాదా అన్న ప్రశ్నకి సమాధానం" అనడిగాను సూటిగా. హృదయం ఆవేదనతో, ఆవేశంతో మండి పోసాగింది.

"ఇన్నాళ్ళ తరవాతలడేం ప్రశ్న సంధ్యా? నువ్వంటే నా కెప్పుడూ ఇష్టమే". అన్నాడు. నా ప్రశ్న వల్ల తనలో రేగిన కలవరాన్నీ, సంకోచాన్నీ దాచడానికి ప్రయత్నిస్తూ.

"మరయితే నీకు మిగతా విషయాలు దేనికి బావా?"

"మిగతా విషయా లంటే?" అనడిగాడు అర్థం కానట్లు నటిస్తూ.

'కట్నం వగైరా."

"కట్నం లేకుండా ఎవరు చేసుకుంటారు సంధ్యా— బొత్తిగా చిన్న పిల్లలా మాట్లాడతావు?"

"నీకు నిజంగా కావలిసింది నేనే అయితే ఇతర విషయాలు నీ కనవసరం. నా మీద నీకు నిజంగా ప్రేమే ఉంటే ఆ విషయాల గురించి ప్రస్తావించవు." రోషంగా అన్నాను.

"అదేం మాట సంధ్యా—నాకు నీ మీద ఎంతో ప్రేమ. కానీ మీ నాన్న ఇస్తుంటే కాదనడం ఎందుకూ. మీ నాన్న ప్రత్యేకంగా నా కోసం అంటూ అప్పులు చెయ్యటం లేదుగా. ఉన్న దాంట్లోనే ఇస్తున్నాడుగా. అదీగాక తీర్చుకోవాలిసిన అప్పులు చాలా

ఉన్నాయి. అయినా అది మన కిద్దరికీ పనికి వస్తుంది . . ." అన్నాడు అనునయించే ధోరణిలో.

నా హృదయం కుత కుతా ఉడికి పోసాగింది. నాకు తెలీకుండానే పళ్ళు నూరాను. తమాయించుకుని ఆఖరి సారిగా పరీక్షించాను. "అప్పులు చేస్తున్నారో ఉన్న దాంట్లోనుండే ఇస్తున్నారో నీ కనవసరం. నేనా ఉద్యోగం చెయ్యాలను. అప్పులు తీరడం సమస్య కాదు. ఆలోచించి చూడు". అన్నాను ఆవేశాన్ని బలవంతంగా దిగమింగుకుంటూ.

"ఎందుకంత మొండి పట్టుదల నీకు సంధ్యా? మీ నాన్నకు లేని బాధ నీ కెందుకూ? లోకంలో అందరూ ఇలాగే చేసుకోవడం లేదా?" అన్నాడు కొంచెం విసుగ్గా.

నాలో సహనం నశించింది. మధ్యలోనే అడ్డం తగులుతూ "అందరి విషయమూ వదిలెయ్యి. మా నాన్నగారి దగ్గరకూడా డబ్బు ఉంది. కానీ ఆయన పయాపైసా కట్నం ఇవ్వరు. నేను ఇవ్వనివ్వను. నీకు నేనే కావాలో కట్నం కావాలో తేల్చుకో." అన్నాను ఖండితంగా.

"నాకు పదిహేను వేల దాకా ఇచ్చేందుకు."

"నీకు డబ్బే ప్రధానం అయినప్పుడు ఆ మాట సూటిగా చెప్పాలి కానీ, నా మీద ప్రేమ ఉందని ఎందుకన్నావు?"

"నీ మీద ప్రేమ ఎందుకు లేదు. కానీ మీ నాన్న ఇవ్వాలి. ఇప్పుడూ ఇస్తున్నప్పుడూ నీ కెందుకు బాధ. . ."

"ఏ. అది మాటా? ఇలా చెప్పడం కంటే నీ మీద నాకు ప్రత్యేక భావం అంటూ ఏమీ లేదు. కట్నం ఇచ్చే పరిస్థితిలో ఎవరైనా ఒకటే అని సూటిగా నిష్కర్షంగా చెప్పి ఉంటే నేను చాలా సంతోషించి ఉండేదాన్ని. . . బావా. నేను మనుషుల్లో ఎక్కువగా అసహ్యించుకునే గుణం నీ లోనే ఉంది. . . కానీ నిన్నే పైకి ప్రేమించాను. పొరపాట్లు. నా లాటి తెలివి తక్కువ వాళ్ళు ఎక్కడా ఉండరు." నా ఆవేదన కన్నీళ్ళ రూపంలో ఉబికింది.

"ఇప్పుడు మునిగి పోయిందేముంది సంధ్యా. . . కొంచెం ఆవేశం వదిలి నువ్వే ఆలోచించు. . ."

మధ్యలోనే కోపం కొద్దీ అరిచాను. "అవును. ఏమీ మునిగి పోలేదు. కానీ మునిగి పోయే ముందు కళ్ళు తెరిచాను. నీకు వేలకి వేలు రూపాయల వచ్చే సంబంధాలు నువ్వు చూసుకో. మన పెళ్ళి జరగదు. జరగడానికి వీల్లేదు."

తనకి కోపం వచ్చింది. "మా నాన్నకి డబ్బు మిగల్చాలని నీ తాపత్రయం. నాకు తెలియదా? మహా తెలివి గల దానివి. అందుకే నేను దొరికాను. అయినా కట్నం లేకుండా ఎవర్ని చేసుకుంటావో నేను చూస్తాను" అంటూ సవాలు చేశాడు.

ఆ అవహేళనకి నా లోని అహం ఎంత గాయపడినా, పైకి నవ్వాను. 'కట్నం ఇచ్చే చేసుకుంటాను. నీ కిచ్చే దానికంటే రెట్టింపు కట్నమే ఇచ్చుకుంటాను. కానీ నీ కంటే పెద్ద ఉద్యోగస్తుడినీ, విద్యాధికుడినీ, సంస్కారవంతుడినీ చేసుకుంటాను. ఇక నువ్వు వెళ్ళవచ్చు' అన్నాను. ఇప్పుడు అతడి పట్ల నా కున్నది ప్రేమ కాదు. ద్వేషం. అసహ్యం కన్న.

అతడు తెల్లబోయాడు. నేను మాట్లాడడానికి అతడికి మరో అవకాశమే ఇవ్వలేదు. కట్టలు తెంచుకున్న ఆవేశంలో ఉద్వేగంలో కొంత సేపు ఏడ్చాను. అతన్ని అభిమానించడం ఎంతో వెర్రితనం. రంగు బయట పడ్డాక ఏడవడం మరీ వెర్రితనం అనుకుని నవ్వుకున్నాను. నా తెలివి తక్కువ తనానికి నామీద నాకే అసహ్యం వేసింది. నాన్నగారి మొహంలోకి చూడలేక పోయాను. ఆ తరవాత నాన్నగారు తెచ్చిన రెండు మూడు సంబంధాల్లో ఒక దాన్ని గురించి నా నిశ్చయం తెలియజేశాను.

నా నిశ్చయం విని అమ్మా నాన్నా విస్తుపోయారు. ఆ సంబంధం ధర అన్నిటి కంటే చాలా ఎక్కువ. నాన్నగారికి మరో ఏడు వేల దాకా అప్పు చెయ్యవలసి ఉంటుంది. నాకు తెలుసు. నాన్నగారు ముందు నేను ఓడిపోయాను."

సంధ్య చెప్పిందంతా విని అతడు నిట్టూర్చాడు "నువ్వు ఓడిపోలేదు. . . సంధ్యా" అన్నాడు.

సంధ్య నవ్వింది. "అవును. మిమ్మల్ని భర్తగా పొంది నేను ఓడిపోలేదు. ప్రపంచంలో కెల్లా ఎంతో విలువైన దాన్ని పొందాను. . ."

అతడు మృదువుగా ఆమె నోటికి చెయ్యి అడ్డం పెట్టాడు. కానీ సంధ్య చెప్పడం ఆపడం లేదు. "అతడికి ప్రత్యేకంగా కార్డు పంపించినా రాలేదు. మిమ్మల్ని చూసి అతడు ఈర్ష్యతో మండి పోవాలని నా ఆశ. . . కానీ ఏ మొహం పెట్టుకుని వస్తాడు. . . రోగ్." సంధ్య నవ్వులో ప్రతీకార జ్వాల మండుతున్నది. ఆ ప్రతీకార జ్వాలల వెనక కన్నీటి తెరలలో అవమాన పడ్డ స్త్రీత్వం తాలూకు రోదన బాపురు మంటూ వినిపించ సాగింది.

తెలిసీ తెలియక హృదయంలో ఒక మొక్కని నాటింది. అది కొంచెం పెరిగిందాకా కానీ తెలియ లేదు—అది ఒట్టి పిచ్చి మొక్కని. తెలిసినాక దాన్ని పీకి పారేసింది. దానివల్ల హృదయానికి కొంచెం కష్టం కలుగుతుంది. నిజమే. కానీ ఈ సారి కొత్తగా నాటిన విత్తనంలో తాను పొరబడ లేదని గాఢంగా నమ్ముతున్నది. 'ఇది తప్పకుండా పువ్వులు పూస్తుంది సంధ్యా! ఈ సారి నువ్వు పొరబడ లేదు' అని అనుయించాలని అతడి కనిపించింది. అందుకు తాను దోహదం చెయ్యాలి. సంధ్య నమ్మకం ఈ సారి వమ్ము కాకూడదు అనుకున్నాడు.

అతడి మనస్సు ఇప్పుడు తేలిక పడింది. అది కొత్తగా స్పందించ నారంభించిందేమో ననిపించింది.

తొలకరి జల్లులు . . మోడు వారిన చెట్ల మీద కొత్త చిగుళ్ళు. . . సంధ్యారుణ కాంతులో కొంగ్రొత్త వెలుగులు. అన్నీ అతడి కళ్ళకి కొత్తగా మొదటి సారిగా కనిపించాయి. . . అతడు ఆమె కళ్ళల్లోకి చూశాడు. అతడ్ని చూసుకుని ప్రపంచాన్నంతా జయించిన తృప్తి ఆమె కళ్ళల్లో ప్రతిఫలించింది. అతడు ఇన్నాళ్ళూ తన జీవితనౌక నిలదొక్కుకోవడానికే ఒక లంగరు అవసరం అనుకున్నాడు. కానీ తన వూగి తూగే నావ మరో నావకి లంగరుగా ఉపయోగపడుతుందని కలలోనూ వూహించ లేదు. ఆ తృప్తి ఎంతో అపూర్వమైనది. చిత్రమైనది. అతడు ఇన్నాళ్ళూ అనుకనే వాడు. తాను ఓటమినైనా స్వీకరించ గలడు కానీ, రాజీ పడడం మాత్రం తన వల్ల కాదని. కానీ అది ఇప్పుడు ఎంతో సులువై పోయింది. . . ఆమె కళ్ళలోకి చూస్తూ ఉండి పోయాడు. ఆమె కళ్ళూ అదే తృప్తితో కన్నీటి తెరల తళతళతో మెరుస్తున్నాయి. ఆ ఆరీ ఆరని కన్నీటి లలో అతడి కళ్ళకి నీహారిక కనిపిస్తున్నది. నవ్వుతూ కళ్ళలో నిలిచిన రెండు కన్నీటి బిందువులతో అభినందనలు పలుకుతూ గెలిచి నందుకు కాదు రాజీ పడ గలిగినందుకు.

ఇద్దరూ కొంచెం సేపు నిశ్శబ్దంగా నిలబడి పోయారు. హృదయాల్లోని ఉద్వేగం చల్లారేందుకు. ఆలోచనల్లో శిల్పాల్లాగా నిలబడి పోయి తదేకంగా పేవ్‌మెంటు వారగా నిలిచిన వర్షపు నీటిలోని ప్రతిబింబాలనీ, వాటిమీద తేలే రంగుల్ని చూస్తూ ఉండిపోయారు.

ఎంత అందమైన వర్ణాలు. ఎంత చిత్రమైన విన్యాసాలు. ప్రతి విన్యాసంలోనూ ఎన్నెన్ని ఇంద్ర ధనుస్సులు.

చీకటి పడింది.

చూస్తుండగానే ఆ నీటిలో దీపాలు వెలిగాయి.

*

